క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీలకు ఉచిత ఆధార్



నెల్లూరు(అర్బన్) : నగరంలోని కలెక్టరేట్ ఆవరణలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో బుధవారం ఎస్సీ, ఎస్టీలు ఉచిత ఆధార్ సేవలు పొందారు. పలువులు ఎస్సీ, ఎస్టీలు ఆధార్‌కార్డులు తీయించుకుని రసీదులు పొందారు. ఈ సందర్భంగా సెంటర్ ఆపరేటర్ సల్మాన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు ఉపయోగించుకోవాలని కోరారు.

భవానీ దీక్షలు ప్రారంభం



నెల్లూరు(బృందావనం) : మైపాడురోడ్డులోని పినాకిని తీరాన కాశీనాయన ఆశ్రమంలో 'దుర్గా భవానీ దీక్షలు' బుధవారం ప్రారంభించారు. ధర్మసింధు ఆధ్యాత్మిక సేవా సమితి ప్రతినిధి ధన్వి శ్రీనివాస్ మాట్లాడుతూ వంద మంది అమ్మవారి భక్తులతో దీక్షను ప్రారంభించామన్నారు. సమితి సభ్యులు ఉల్లి అనిల్ కుమార్, కంచర్ల మహేష్, మహంకాళి వెంకటేష్, పాలా చెన్నకృష్ణ, కల్పన, పద్మావతి, సీతమ్మ, శ్రావణి పాల్గొన్నారు.

రోశయ్యకు నివాళి



నెల్లూరు(బృందావనం) : స్టోన్‌హౌస్‌పేటలోని జిల్లా రైస్ కాన్వాసింగ్ అసోసియేషన్ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, దివంగత కొణిజేటి రోశయ్య వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి షణ్ముఖరావు మాట్లాడుతూ స్టోన్‌హౌస్‌పేటలో కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహ ఏర్పాటుకు నగరపాలక సంస్థ అనుమతి మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ చీఫ్ ఆర్గనైజర్ కోట గురుబ్రహ్మం, ఈసీ మెంబర్ భవనాసి సురేష్, వడమాల రమేష్, పీవీ శేషారావు, ఆంజనేయులు, కొండా ప్రవీణ్‌శంకర్, సతీష్, దాసా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి పుష్పాభిషేకం



నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానంలో బుధవారం పుష్పాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా కత్తి మోహన్‌రావు- విజయలక్ష్మి, కత్తి వెంకటేశ్వర్లు- రాజేశ్వరి, భరత్‌కాంత్- లక్ష్మీదుర్గ వ్యవహరించారు. శ్రీస్వామి అయ్యప్ప సేవా సమాజం అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గద్దం రత్నయ్య, జి.విజయకుమార్, పి.ప్రసాద్ పర్యవేక్షించారు.

సోలార్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎస్‌ఈ విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ విద్యుత్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ విజయన్ కోరారు. నగరంలోని విద్యుత్‌భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకం ద్వారా లబ్ధిపొందేందుకు రిజిస్టర్ చేసుకుని ప్రభుత్వం ఇచ్చే రాయితీ పొందవచ్చన్నారు. వినియోగదారులు విద్యుత్ ఆదా చేసుకోవాలని కోరారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



నెల్లూరు(బారకాసు) : నగరంలోని వెంకటేశ్వరపురంలో టిడ్కో గృహ సముదాయాల వద్ద బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పిచ్చి మొక్కలు, పచ్చిగడ్డిని తొలగించి అక్కడి పరిసరాలను పరిశుభ్రం చేశారు. అలాగే మురుగు నీరు రోడ్లపైకి ప్రవహించకుండా తగిన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌ఓ డాక్టర్ చైతన్య మాట్లాడుతూ దోమల నియంత్రణకు తగిన చర్యలు తీసుకున్నామన్నారు. గృహ సముదాయాల ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లడం, మురుగు నీరు నిల్వ లేకుండా అవసరమైన పనులు చేశామన్నారు.

క్రమబద్ధీకరణ లేక.. జీవనం సాగక

- దుర్భరంగా విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు
- అందని కనీస వేతనాలు
- కష్టతరంగా కుటుంబ పోషణ



విద్యుత్‌భవన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ఇంటింటా నిరంతర విద్యుత్‌కు ఆ శాఖలో పనిచేసే సిబ్బందితో పాటు, ఔట్ సోర్సింగ్ సిబ్బందే కీలకం. కాగా అందులో శాశ్వత ఉద్యోగుల కంటే ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహించే సిబ్బందే అధికంగా ఉన్నారు. అయితే వీరు గత 20 ఏళ్లుగా ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కం వంటి పలు విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్నప్పటికీ కనీస ఉద్యోగ భద్రత ఉండదు. దీనికి తోడు కనీస సౌకర్యాల కొరత, చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ కష్టతరంగా మారి వేలాది మంది కార్మికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ సంస్థల్లో కాంట్రాక్టు కార్మికులుగా ఉన్న వారందరినీ 2016లో ఔట్‌సోర్సింగ్ పరిధిలోకి తీసుకొచ్చారు.

అందని కనీస వేతనం, సౌకర్యాలు

నిబంధనల మేరకు ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సి ఉండగా, పాత, కొత్త కార్మికులకు ఇచ్చే వేతనాల్లో వ్యత్యాసాలు ఉన్నాయి. వారికి కనీస సౌకర్యాలు అందడం లేదు. గతంలో పదేళ్లు నిండిన కార్మికునికి ఇంక్రిమెంట్ ఇచ్చేవారు. ప్రస్తుతం అలాంటి విధానం అమలు కావడం లేదు. రిటైర్ అయిన ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఎలాంటి బెనిఫిట్స్ అందడం లేదు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతిచెందిన కార్మికునికి సంబంధించి కుటుంబానికి ఎలాంటి నష్టపరిహారం, పింఛన్, ఈఎస్‌ఈ అందించక పోగా, ఇన్సూరెన్స్ కూడా సక్రమంగా అమలు చేయడం లేదు. వీరు 20–30 ఏళ్లుగా విద్యుత్ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్నా. వీరి క్రమబద్ధీకరణ (రెగ్యులర్)పై ఎన్నికల సమయంలో వివిధ పార్టీలు హామీలు ఇస్తాయి. తరువాత గాలికొదిలేస్తాయి.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి నెల్లూరు జిల్లా డిస్కం(ఎస్పీడీసీఎల్) పరిధిలో 230 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. మొత్తం వెయ్యి మంది షిఫ్ట్ ఆపరేటర్లు, 240 మంది వాచ్‌మెన్లు (ఫీల్డ్ అసిస్టెంట్లు), వంద మంది కంప్యూటర్ ఆపరేటర్లు, 200 మంది మీటర్‌రీడర్స్, స్టోర్స్‌లో పనిచేసే హమాలీలు 30 మంది, ఎస్పీఎం(ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్ల విభాగం)లో 55 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. ఇతర విభాగాల్లో 50 మంది, 125 మంది గ్యాంగ్‌మెన్లు, డ్రైవర్లు, హౌస్‌కీపింగ్ కార్మికులు, బిల్లింగ్ క్లర్క్స్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

– జిల్లా ట్రాన్స్‌కో పరిధిలో 148 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. ఇందులో 800 మంది హైస్కిల్డ్ (డిప్లొమో హోల్డర్స్), స్కిల్డ్ (ఐటీఐ హోల్డర్స్) లు షిఫ్ట్ ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్నారు.

– జిల్లా జెన్‌కోలో అవుట్ సోర్సింగ్, పీస్‌రేట్ పద్ధతిలో 1,400 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. మొత్తంగా విద్యుత్ సంస్థలో 4,000 మందికిపైగా విధులు నిర్వహిస్తున్నారు.

పట్టించుకోవడం లేదు

ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ మా బతుకులు మాత్రం మారడం లేదు. ఎన్నికల సమయంలో విద్యుత్ సంస్థలోని రెగ్యులర్ చేస్తామని రాజకీయ నాయకులు హామీలు ఇస్తున్నారు. అనంతరం పట్టించుకోవడం లేదు.

– పతంజలి, 327 యూనియన్ నేత

తక్షణమే రెగ్యులర్ చేయాలి



ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న వేలాది మంది విద్యుత్ కార్మికులను తక్షణమే రెగ్యులర్ చేయాలి. ప్రమాదాలు జరిగితే వీరిని ఆదుకునేందుకు అన్‌లిమిటెడ్ మెడికల్ పాలసీని అమలు చేయాలి. పీఆర్సీ అరియర్స్ వెంటనే చెల్లించాలి. పదేళ్లు నిండిన కార్మికులకు ఇంక్రిమెంట్లు ఇవ్వాలి. నూతనంగా విధుల్లో చేరిన షిఫ్ట్ ఆపరేటర్లకు పాత వారితో సమానంగా వేతనాలు చెల్లించాలి.

– బొజ్జా సుమన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి

13 ఏళ్లుగా పనిచేస్తున్నా



గత 13 ఏళ్లుగా విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నా. చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ కష్టతరంగా మారింది. ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తే బాగుంటుంది.

– అవుల మనోజ్‌కుమార్, షిఫ్ట్ ఆపరేటర్

సచివాలయంలో తాగుబోతు హల్‌చల్



నెల్లూరు సిటీ : నేను ఎవరనుకున్నావ్.. జనసేన నేతను.. నాకే పింఛన్ ఇవ్వరా.. అని వార్డు సచివాలయంలో ఓ తాగుబోతు హల్‌చల్ చేశాడు. స్టోన్‌హౌస్‌పేటలోని వార్డు సచివాలయానికి బుధవారం వీవర్స్‌కాలనీకి చెందిన ఓ వ్యక్తి పూటుగా మద్యం సేవించి వచ్చాడు. ఈ క్రమంలో తనకు పన్ను విరిగిందని, వెంటనే పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అంతే కాకుండా సచివాలయం బయట నుంచి పెద్దగా కేకలు వేస్తూ మహిళా ఉద్యోగులపై దుర్భాషలాడాడు. ఈ క్రమంలో సచివాలయ ఉద్యోగులు నవాబుపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సచివాలయం వద్దకు చేరుకుని అతన్ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'



మాట్లాడుతున్న శ్రీనివాసులు

నెల్లూరు సిటీ : రూరల్ మండలంలోని కందమూరు, ములుముడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులు పంట బీమా చేయించుకోవాలన్నారు. రూరల్ ఏఓ నాగమోహన్, సహాయకులు రమేష్ గాంధీ, అనూష పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఏఎస్సై శ్రీహరి

నెల్లూరు(క్రైమ్) : ప్రతిఒక్కరూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్(ఏహెచ్‌టీయూ) ఏఎస్సై శ్రీహరి సూచించారు. నగరంలోని సుంకు చెంగన్న నగరపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు రక్షణ చట్టాలు, గుడ్-బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు తదితరాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వారు చెడుభావంతో చూస్తున్నా, తాకరాని చోట్ల తాకినా వెంటనే డయల్ 100, 112కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మత్తు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత సమాచారం, ఫొటోలు పెట్టరాదన్నారు. ఆకర్షణలకు లోను కాకుండా, చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏహెచ్‌టీయూ ఏఎస్సై సతీష్‌బాబు, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం కె.అరవింద్, సిబ్బంది మస్తాన్ నాయుడు, స్వరణ, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దేశరక్షణలో నౌకాదళ పాత్ర గొప్పది



ర్యాలీలో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు

నెల్లూరు(అర్బన్) : దేశరక్షణలో నౌకాదళ సైనికుల పాత్ర ఎంతో గొప్పదని 10 ఆంధ్రా నేవల్ యూనిట్ ఎన్‌సీసీ సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు అన్నారు. భారత నౌకాదళ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని కేఎన్నార్ ఉన్నత పాఠశాల నుంచి ప్రభుత్వ పెద్దాస్పత్రిలోని తల్లీబిడ్డల విభాగం(ఎంసీహెచ్) వరకు ఎన్‌సీసీ కేడెట్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడి చిన్నపిల్లల వార్డు, ప్రసూతి వార్డులోని బాలింతలు, పేషెంట్లకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుండాల నరేంద్రబాబు మాట్లాడుతూ భారతదేశానికి మూడువైపులా ఉన్న సముద్రంలో నౌకాదళ సైనికులు గస్తీకాస్తూ శత్రువులు చొరపడకుండా దేశాన్ని కాపాడుతున్నారన్నారు. 1971 డిసెంబర్ 4న పాకిస్తాన్‌లోని ప్రధాన ఓడరేవైన కరాచీపై భారత నావికాదళం మెరుపుదాడి చేసి వారి ఆయుధ సామగ్రిని ధ్వంసం చేసిందని, దీంతో పాకిస్తాన్ ఓటమిని అంగీకరించిందన్నారు. అప్పటి నుంచి ఏటా డిసెంబర్ 4న భారత నౌకాదళ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

'కిమ్స్'లో అరుదైన చికిత్స



మాట్లాడుతున్న కిమ్స్ ఆస్పత్రి డాక్టర్లు

నెల్లూరు(అర్బన్) : డెంగీ వ్యాధితో రక్తకణాలు తగ్గిపోయి ఆయాసంతో పాటు పొట్టలో నీరు చేరి ఉబ్బిపోయిన హైరిస్క్ గర్భిణికి తమ ఆస్పత్రిలో అరుదైన చికిత్స చేసి ప్రాణాలు కాపాడామని కిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఐవీఎఫ్, కాస్మోటిక్ గైనకాలజిస్ట్ డాక్టర్ మారం జనిత్య తెలిపారు. దర్గామిట్టలోని కిమ్స్ ఆస్పత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె వివరించారు. నగరానికి చెందిన 20 ఏళ్ల వి.వైష్ణవి ఆరునెలల గర్భిణి. ఆమెకు కొద్దిరోజుల క్రితం డెంగీ సోకి ప్లేట్‌లెట్ 15 వేలకు పడిపోయింది. ఆయాసంతో నడవలేని స్థితిలో, పొట్టలో నీరు చేరిన పరిస్థితుల్లో గతనెల 29న కిమ్స్ ఆస్పత్రిలో చేరిందన్నారు. తాము వెంటనే ఎమెర్జెన్సీ వార్డులో చేర్చుకుని స్కానింగ్, రక్త పరీక్షలు చేశామన్నారు. ఈస్థితిలో సింగిల్ డోనార్ బ్లడ్‌తో పాటు జంబో రక్తకణాలు వైష్ణవికి ఎక్కించామన్నారు. జనరల్ ఫిజీషియన్ రవికిరణ్, ఇంటెన్సివిస్ట్ జగదీష్‌ల సాయంతో గర్భిణికి అరుదైన చికిత్స చేశామన్నారు. మహిళ కోలుకుందని, డిశ్చార్జి చేస్తున్నామన్నారు. హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరినాయుడు డాక్టర్లను అభినందించారు.

చదువులు చెప్పాలని ధర్నా



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ట్రైబల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు చదువులు చెప్పాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో కొండాయపాళెం గేటు వద్ద ఐటీడీఏ జిల్లా కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో దాదాపుగా 20 రోజులుగా పదో తరగతి విద్యార్థులకు తరగతులను నిర్వహించడం లేదన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. హనీష్, శివంవర్మ, అబ్దుల్, సుధీర్, శరన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్వే పరీక్ష



పరీక్షను తనిఖీ చేస్తున్న డీఈఓ బాలాజీరావు

నెల్లూరు (టౌన్) : జిల్లాలోని 124 ప్రభుత్వ పాఠశాలల్లో 3, 6, 9 తరగతులు చదువుతున్న 2,940 మంది విద్యార్థులకు బుధవారం సర్వే పరీక్షను నిర్వహించారు. నగరంలోని వేదవ్యాస ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఫత్తేఖాన్‌పేటలోని మున్సిపల్ హైస్కూల్లో పరీక్షను డీఈఓ ఆర్.బాలాజీరావు, వెంగళరావునగర్‌లోని మున్సిపల్ హైస్కూల్, చంద్రబాబునగర్‌లోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, జర్నలిస్టు కాలనీలోని కేంద్రీయ విద్యాలయంలో జరుగుతున్న పరీక్షను సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి తనిఖీ చేశారు. సమగ్రశిక్ష ఏఎంఓ సుధీర్‌బాబు, జిల్లా కామన్‌బోర్డు పరీక్షల విభాగం కార్యదర్శి రామ్‌కుమార్ పాల్గొన్నారు.

6న స్టడీ ప్లస్



మాట్లాడుతున్న డోమనిక్‌రెడ్డి

నెల్లూరు (టౌన్) : విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా వారిలో స్ఫూర్తి నింపేందుకు ఈనెల 6న స్థానిక టౌన్‌హాల్లో స్టడీప్లస్ 2024 పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సైకాలజిస్టు, కన్వీనర్ జి.డోమనిక్‌రెడ్డి తెలిపారు. స్థానిక రమేష్‌రెడ్డినగర్‌లోని కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో జ్ఞాపకశక్తిని పెంపొందించుకునే మార్గాలు, పరీక్ష నైపుణ్యాలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. పూర్తి వివరాలకు డోమనిక్‌రెడ్డి 94419 35461, రమేష్‌బాబు 89190 53022, చంద్రశేఖర్ 97044 05138లను సంప్రదించాలన్నారు. సమావేశంలో సైకాలజిస్టు రమేష్ బాబు, యోగా ట్రైనర్, సైకాలజిస్టు చంద్రశేఖర్‌ప్రణవ్ పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు సత్కారం



నెల్లూరు(క్రైమ్) : దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ ఎం.రోశయ్యను ఫ్యాప్టో నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. నాయకులు తాళ్లూరు శ్రీనివాసులునాయుడు, సురేంద్రరెడ్డి, చిట్టేటి రమేష్, పిచ్చిబాబు తదితరులు ఉన్నారు.

హిందువులపై దాడులు ఆపాలి



నెల్లూరు(బృందావనం) : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఆపాలని హిందూ రక్షా వేదిక ఆధ్వర్యంలో బుధవారం నగరంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. వీఆర్సీ మైదానం నుంచి గాంధీబొమ్మ, కనకమహల్ సెంటర్ మీదుగా గాంధీబొమ్మ సెంటర్ వరకు నిరసన చేశారు. ఈ సందర్భంగా సీనియర్ అడ్వొకేట్ పల్నాటి రామదండు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ నిర్వాహకుడు రామకృష్ణ దాస్‌పై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకూరుపేట లలితామహేశ్వరి ఆశ్రమ పీఠాధిపతి మహేష్‌స్వామి, బీజేపీ రాష్ట్ర నేతలు కర్నాటి ఆంజనేయరెడ్డి, పి.సురేందర్‌రెడ్డి, కందికట్ల రాజేశ్వరమ్మ, మిడతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా

నెల్లూరు(సెంట్రల్) : రూరల్ పరిధిలోని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. 'గడప గడపకు మీ గిరిధర్‌రెడ్డి' కార్యక్రమాన్ని బుధవారం 19వ డివిజన్‌లో ఆయన ప్రారంభించారు. హరనాథపురం, ముత్తుకూరు రోడ్డు ప్రాంతాల్లోని రోడ్డు మార్జిన్ వ్యాపారులను కలిశారు.

ఘనంగా ఘంటసాల జయంతి



నెల్లూరు(బృందావనం) : మధుర గాయకుడు, పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి వేడుకలను సుబేదారుపేటలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్, లక్ష్మి ఫర్నిచర్స్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి గాయకుడు పాటూరు శ్రీనివాసులు హాజరై, ఘంటసాల చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఘంటసాల గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో కేతా సుబ్బారావు, ఆనంద్, మేదరసంఘం నాయకులు నాగినేని ప్రభాకర్, జగన్, మోహన్, ముక్కు గోవర్ధన్, సత్యనారాయణ పాల్గొన్నారు.



కస్తూర్బా కళాక్షేత్రంలో..

పుష్పాంజలి

కేవీఆర్ పెట్రోల్ బంక్ వద్ద ఉన్న శ్రీవెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో ఘంటసాల వెంకటేశ్వరరావు కాంస్య విగ్రహానికి గాయకుడు నీలకంఠం శ్రీనివాసులురెడ్డి బుధవారం పుష్పాంజలి సమర్పించారు. కార్యక్రమంలో గాయకులు ఆనంద్, రామచంద్రరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

20 టౌన్ బస్సులపై కేసుల నమోదు

- రూ.3 లక్షల అపరాధ రుసుము వసూలు



టౌన్ బస్సును తనిఖీ చేసిన ఎంవీఐ రఫీ

నెల్లూరు(టౌన్): ఉప రవాణా కమిషనర్ చందర్ ఆదేశాలతో నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో తిరుగుతున్న టౌన్ బస్సులను బుధవారం రవాణా అధికారులు తనిఖీ చేశారు. బృందాలుగా ఏర్పడి నగరంలోని వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. పర్మిట్‌లో తీసుకున్న రూట్ కాకుండా అదనంగా రూట్లలో తిరగడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోవడం తదితర కారణాలతో 20 బస్సులపై కేసులు నమోదు చేశారు. రూ.3 లక్షల అపరాధ రుసుము వసూలు చేశారు. రోజూ టౌన్ తనిఖీలు చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇన్‌చార్జి ఆర్టీఓ బాలమురళీకృష్ణ, ఎంవీఐలు ఎండీ రఫీ, కార్తీక్, బాబు, ఏఎంవీఐలు పూర్ణచంద్రరావు, స్వప్నీల్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితురాలికి ఉద్యోగం



డీఆర్వో నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న హేమలత

నెల్లూరు(అర్బన్) : అట్రాసిటీ బాధితురాలు హేమలతకు కలెక్టర్ ఆనంద్ ఉద్యోగం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అందుకు సంబంధించిన నియామక పత్రాన్ని కలెక్టరేట్‌లో డీఆర్వో ఉదయ భాస్కర్‌రావు బుధవారం బాధిత మహిళకు అందించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ 2022 జనవరి 8న హరనాథపురంలోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న ఎస్సీ వర్గానికి చెందిన మొదగమాల మోహన్‌ను అదేప్రాంతానికి చెందిన ఇద్దరు అగ్రకులాల వారు మద్యం మత్తులో దాడి చేసి హత్య చేశారన్నారు. ఈ కేసులో మృతుని కుటుంబానికి ఇప్పటికే రిలీఫ్ ఫండ్ కింద రూ.8.20 లక్షలు ఇచ్చామన్నారు. ఇప్పుడు బీసీ సంక్షేమ హాస్టల్‌లో నాలుగో తరగతి ఉద్యోగినిగా మృతుని భార్య హేమలతను నియమించామన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ మాజీ సభ్యుడు కొప్పాల రఘు పాల్గొన్నారు.

పశువులను గోశాలకు తరలిస్తాం

- వెటర్నరీ వైద్యాధికారి మదన్‌మోహన్



పశువులను గోశాలకు తరలిస్తున్న వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్

నెల్లూరు (బారకాసు) : ప్రధాన రోడ్లపై పశువులు కనిపిస్తే తప్పనిసరిగా గోశాలకు తరలిస్తామని నగరపాలక సంస్థ వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ మదన్ మోహన్ హెచ్చరించారు. నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ ఆదేశాల మేరకు పశువులను గోశాలకు తరలించే స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా స్థానిక మద్రాస్ బస్టాండ్, వేదాయపాళెం, పొదలకూరు రోడ్డు, బారాషహీద్ దర్గా, ప్రాంతాల్లో సంచరిస్తున్న ఐదు పశువులను కల్లూరుపల్లి గోశాలకు బుధవారం తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్ మదన్‌మోహన్ మాట్లాడుతూ వాహన ప్రమాదాలకు కారణమవుతున్న రోడ్లపై సంచరించే పశువులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. పశువులను గోశాలకు తరలించి వాటి సంరక్షణ బాధ్యతలను నగరపాలక సంస్థ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తుందని తెలిపారు. పశువులను యజమానులు వాళ్ల ప్రాంగణాల్లోనే ఉంచుకోవాలని, రోడ్లపై వదిలితే తప్పనిసరిగా గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు. అనంతరం పందుల పెంపకందారులకు నోటీసులు అందజేసి, జనావాసాల మధ్య పందులను వదలకూడదని తెలియజేశారు.

బ్యాంక్ ఖాతాదారులకు అవగాహన సదస్సు

నెల్లూరు సిటీ : రూరల్ పరిధిలోని కొత్తవెల్లంటి గ్రామంలో ట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో బ్యాంక్ ఖాతాదారులు, పొదుపు గ్రూపు సభ్యులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సెక్రటరీ అహ్మద్‌బాషా మాట్లాడుతూ ప్రతి ఖాతాదారుడు ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు జరిపే క్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంస్థ రిసోర్స్ పర్సన్‌లు టి.వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.